క్లుప్తంగా

ల్యాబ్ టెక్నీషియన్స్ జిల్లా కార్యదర్శిగా సురేష్

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): ల్యాబ్ టెక్నీషియన్స్ జిల్లా కార్యదర్శిగా రావాడ రామభద్రాపురం పీహెచ్‌సీ ల్యాబ్ టెక్నీషియన్ రెడ్డి సురేష్ కుమార్‌ను ల్యాబ్ టెక్నీషియన్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు రెడ్డి సురేష్‌కుమార్ బుధవారం కురుపాంలో విలేకర్లతో మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని ఎన్జీఓ హోంలో ఎన్జీఓ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు కె.వి వెంకటరావు, మన్యం జిల్లా అధ్యక్షుడు జీవీఆర్ఎస్ కిషోర్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం ఎన్నికలు జరిగాయని తెలిపారు.

ఇంటిపన్ను వసూలు వేగవంతం

వీరఘట్టం: పంచాయతీల్లో అభివృద్ధి పనులకు నిధులు సమకూర్చుకోవాల్సిన బాధ్యత మన దేనని.. అందుకనుగుణంగా ఇంటి పన్నుల వసూళ్లను వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ బి.వెంకటరమణ సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. మండల వ్యాప్తంగా ఇంటి పన్నుల ఎరియర్స్ ఎంత ఉంది...డిమాండ్ ఎంత.. తదితర విషయాలను పంచాయతీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు.

అప్పలనాయుడు కుటుంబానికి పరామర్శ

పాలకొండ: నగర పంచాయతీ పరిధిలోని ఎన్‌కే రాజపురానికి చెందిన గోగుల అప్పలనాయుడును మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి బుధవారం పరామర్శించారు. ఇటీవల అప్పలనాయుడు భార్య అప్పలనరసమ్మ అనారోగ్యంతో మరణించారు. ఈ మేరకు ఆమె ఆ కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఆమెతోపాటు కౌన్సిలర్లు నీలాపు శారద, శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

నీటి కుంటల తవ్వకాలపై దృష్టి

వీరఘట్టం: ఉపాధి హామీ పథకంలో భాగంగా వేతనదారులు నీటి కుంటల తవ్వకాలపై దృష్టి సారించేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ బి.వెంకటరమణ ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీటికుంటల ఏర్పాటు వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించాలని సూచించారు. అలాగే వేతనదారులందరికీ పనులు కల్పించేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో ఏపీఓ జి.సత్యం నాయుడు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలను సందర్శించిన ఏయూ ఆచార్యులు


తరగతి గదులను పరిశీలిస్తున్న ఏయూ ఆచార్యులు

గుమ్మలక్ష్మీపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆంధ్ర విశ్వ విద్యాలయం ఆచార్యులు డాక్టర్ కె.వెంకటరావు (హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ కంప్యూటర్ సైన్స్), డాక్టర్ పి.బి.పడాల్ (డిపార్ట్‌మెంట్ ఆఫ్ బోటనీ) బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరంతో కలిసి కళాశాలలోని డిపార్టుమెంట్లను, తరగతి గదులను, ల్యాబ్‌లను, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. డిగ్రీ కళాశాలకు పర్మినెంట్ ఎఫిలియేషన్ మంజూరు నిమిత్తం తాము సందర్శించినట్లు ఈ సందర్భంగా వారు తెలిపారు.

10న జీడి రైతుల సదస్సు

గుమ్మలక్ష్మీపురం: జీడిమామిడి రైతుల సమస్యలపై చర్చించేందుకు కురుపాం మండలం పి.లేవిడి సమీపంలో గల రబ్బరు తోట వద్ద ఈ నెల 10న జీడిమామిడి రైతుల సదస్సును నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు తెలిపారు. గుమ్మలక్ష్మీపురంలో ఆ సంఘం నాయకులతో కలిసి సదస్సుకు సంబంధించిన కరపత్రాలను బుధవారం విడుదల చేశారు. జిల్లాలో లక్ష ఎకరాల్లో జీడి పంటను గిరిజనులు సాగు చేస్తుండగా.. మద్దతు ధర లేకపోవడం, దళారులే కొనుగోలు చేస్తుండడం వలన ప్రతీ ఏటా గిరిజన జీడి రైతులు నష్టపోవాల్సి వస్తోందన్నారు. ప్రారంభంలో ఉన్న ధర రైతులకు పంట చేతికొచ్చే సమయానికి ఉండడం లేదన్నారు.

● ప్రణాళికతో చదివితే సత్ఫలితాలు



పదో తరగతి విద్యార్థులు ప్రణాళికతో చదివి సత్ఫలితాలు సాధించాలని ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ ఆకాంక్షించారు. మండలంలోని పెదఖేర్జిలలో ఉన్న ఏపీ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా టెన్త్ విద్యార్థులతో మాట్లాడారు. భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే పదో తరగతి ఒక పునాది వంటిదన్నారు. భోజనం మెనూ పరిశీలించారు. ప్రిన్సిపాల్ వెంకటరావు, విద్యార్థులు ఉన్నారు. – కొమరాడ

● క్రీస్తుమార్గం అనుసరణీయం..



సర్వ మానవాళిని సన్మార్గంలో నడిపించేందుకు క్రీస్తు చూపిన ప్రేమమార్గం అనుసరణీయని ఆర్‌సీఎం లూర్దుమాత చర్చి ఫాదర్ పి.సుందరరావు అన్నారు. బుధవారం స్థానిక చర్చిలో బ్రదర్ మాలధారణ కార్యక్రమం నిర్వహించారు. 41 రోజులు అనుసరించాల్సిన నియమాలపై మాలధారులకు ఈ సందర్భంగా వివరించారు. అనంతరం క్రీస్తు ఆరాధన, స్తుతి గీతాలను ఆలపించారు. – పాలకొండ రూరల్

● పరామర్శ..



నగర పంచాయతీ మాజీ చైర్‌పర్సన్ యందవ రాధాకుమారిని పాలకొండ మాజీ శాసనసభ్యురాలు విశ్వాసరాయి కళావతి పరామర్శించారు. ఇటీవల రాధాకుమారి శస్త్రచికిత్స చేయించుకున్న క్రమంలో పాలకవర్గ సభ్యులతో కలసి బుధవారం స్థానిక కస్పా వీధిలోగల వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈమె వెంట పార్టీ నాయకులు వెలమల మన్మధరావు, కడగల వెంకటరమణ, తుమ్మగుంట శంకరరావు, దుప్పాడ పాపినాయుడు, కిల్లారి మోహనరావు, కోడెం విజయ్‌కుమార్, నాయకులు లిల్లీ పుష్పనాథం, యందవ మరియదా సు, దుంపల చిన్ని, టేకి రామకృష్ణ, సుంకరి ధర్మారావు పాల్గొన్నారు. – పాలకొండ రూరల్

ఎల్లమ్మ జాతరకు ఏర్పాట్లు పూర్తి

● రేపటి నుంచి మూడు రోజుల పాటు యాత్ర

వీరఘట్టం: వీరఘట్టం మేజర్ పంచాయతీలో ఈ నెల 7వ తేదీ నుంచి 9 వరకు జరగనున్న సిరుల పోతన్న,ఎల్లమ్మ జాతరకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రముఖ యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో ఈ యాత్ర శుక్రవారం నుంచి ఆదివారం వరకు జరగనుంది. ప్రతి ఏటా మహాశివరాత్రి పోయిన పది రోజుల తర్వాత సిరుల జాతర జరగడం ఆనవాయితీగా వస్తోంది. జాతరలో భాగంగా భక్తులు పవిత్ర స్నానాలాచరించి కుటుంబం మొత్తం తాము నివాసముంటున్న వీధుల్లో జోగి దండి స్వామికి నైవేద్యంగా సమర్పిస్తారు. అలాగే మొక్కులు ఉన్న భక్తులు గుడ్లు తీసుకువచ్చి పోతన్న, ఎల్లమ్మ పుట్టలో వేసి, పుట్టమన్నును చెవులకు పెట్టుకుంటారు. జాతరకు వీరఘట్టం, జియ్యమ్మవలస, గరుగుబిల్లి, వంగర, తదితర మండలాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.


పోతన్న,ఎల్లమ్మ పుట్ట


సిరుల పోతన్న గుడి

రుగ్మతలు దూరమవుతాయి

శిరుల పోతన్న, ఎల్లమ్మను దర్శించుకున్న వారికి ఎటువంటి రుగ్మతలు దరి చేరవు. ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉంటారు. ముఖ్యంగా కుష్టు, చర్మవ్యాధులు తొలగిపోతాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు పూర్తి చేశారు.
– ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ, ప్రముఖ యజ్ఞకర్త, వీరఘట్టం

వేగవంతంగా పనులు పూర్తి చేయాలి


కన్నయ్యగూడలో ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న పీడీ

గుమ్మలక్ష్మీపురం: పీఎం జన్‌మన్ గృహాల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రభుత్వ లక్ష్యాన్ని అందిపుచ్చుకోవాలని గృహ నిర్మాణ శాఖ పీడీ పి.రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని రేగులపాడు, అడ్డంగూడ, కన్నయ్యగూడ గ్రామాల్లో నిర్మాణ దశల్లో ఉన్న పీఎం జన్‌మన్ గృహాల పనులను బుధవారం ఆయన పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ నిర్మాణాలు పూర్తి చేసుకునేందుకు బిల్లులు చెల్లింపులు కూడా సకాలంలో చేపట్టడం జరుగుతుందన్నారు. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట హౌసింగ్ ఏఈ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

ఎటువంటి నిర్మాణాలు చేపట్టరాదు


రెండు వర్గాలకు సూచనలు చేస్తున్న బత్తిలి ఏఎస్సై

భామిని: మండలంలోని కీసరలో వివాదాస్పద స్థలంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టరాదని ఏఎస్సై కొండగొర్రి కాంతారావు స్పష్టం చేశారు. ఈమేరకు బుధవారం గ్రామంలో పర్యటించి, వివాదాస్పద స్థలాన్ని పరిశీలించి ఇరువర్గాలతో మాట్లాడారు. స్థల వివాదం కోర్టు పరిధిలో ఉన్నందున తీర్పు వచ్చేవరకు ఎవ్వరూ నిర్మాణాలు చేయరాదని సూచించారు. ముందుగా మండల సర్వేయర్ రాజేశ్వరరావు, వీఆర్‌ఓలు, సహాయ సర్వేయర్లతో కలిసి వివాదాస్పద స్థలాన్ని కొలతలు వేశారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బందితో పాటు బత్తిలి పోలీస్‌లున్నారు.

సంస్థ మనుగడతోనే కార్మిక సంక్షేమం


ఎన్ఎంయూ వ్యవస్థాపక అధ్యక్షుడు రామ్మోహనరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

పాలకొండ: సంస్థ మనుగడే కార్మిక సంక్షేమానికి మార్గమని చెప్పిన వ్యక్తి ఎన్ఎంయూ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పి.రామ్మోహనరావు అని ఆ సంఘ పాలకొండ డిపో అధ్యక్ష, కార్యదర్శులు మజ్జి సుబ్బారావు, వావిలపల్లి రాజేష్ అన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో రామ్మోహనరావు వర్ధంతి నిర్వహించారు. నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంఘ నాయకులు ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆర్టీసీ ఉద్యోగులు మాట్లాడుతూ.. ఏపీఎస్ ఆర్టీసీలో ఎస్‌బీటీ, ఎస్ఆర్‌బీఎస్‌తో పాటు ఆటోమెటిక్ డీఏల సాధన రామ్మోహనరావు కృషేనని కొనియాడారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఎం.వైకుంటరావు, బీఎల్ నారాయణ, వై.నీలయ్య, కె.బుడ్డయ్య, ఎంవీ.నాయుడు, గ్యారేజీ కార్యదర్శి విజయరాం, తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలి

● డీఎస్పీ రాంబాబు


వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న డీఎస్పీ, సీఐ, ఎస్సై, తదితరులు

సీతంపేట: పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెడికల్ క్యాంప్‌లను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు అన్నారు. మర్రిపాడు వారపు సంత వద్ద బుధవారం మెగా వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక ఏరియా ఆస్పత్రి, మర్రిపాడు పీహెచ్‌సీ, జెమ్స్ ఆస్పత్రి వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. దాదాపు ఆరు వందల మంది రోగులు హాజరు కాగా.. వారందరికీ భోజన ఏర్పాట్లు చేశారు. అనంతరం వృద్ధులకు దుప్పట్లు, గొడుగులు, తువ్వాళ్లు అందజేశారు. కార్యక్రమంలో సీఐ చంద్రమౌళి, ఎస్సై వై.అమ్మన్నరావు, స్థానిక నాయకులు వి.చలపతిరావు, రంగనాథం, ఐ.పవన్, ఎస్.సింహాద్రి, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సలహా మండలి నియామకం ఎప్పుడు..?

● పాలకొండ మాజీ ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలైనా గిరిజన సలహా మండలి నియమించకుండా కాలక్షేపం చేస్తోందని పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఆరోపించారు. ఈ మేరకు ముత్యాలు సెంటర్ వద్ద బుధవారం పలువురు గిరిజనులను కలిసి సమస్యలపై మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. గిరిజన మండలి ఏర్పాటుపై గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తే సహించబోమన్నారు. నోరు విప్పితే గత ప్రభుత్వం గిరిజనాభివృద్ధిని అడ్డుకుందని ప్రస్తుత మంత్రి సంధ్యారాణి ఆరోపించడం సరికాదన్నారు. టీఏసీ వేయకుండా గిరిజన మంత్రి సంధ్యారాణి అసెంబ్లీలో మాట్లాడుతూ.. జీఓ 3కి రూపాంతరం తీసుకువస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. గిరిజన సలహా మండలిలో తీర్మానం లేకుండా నీవు ఏం చేయగలవని ప్రశ్నించారు. మా ప్రభుత్వంలో అధికారంలోకి వచ్చిన వెంటనే గిరిజన సలహా మండలిని నియమించి, నాన్ షెడ్యూల్ ప్రాంతంలో ఉన్న గిరిజన గ్రామాలను షెడ్యూల్ ఏరియాలో చేర్పించడానికి ప్రతిపాదించామన్నారు. ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కూడా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నియమించారని చెప్పారు. పరిపాలనా సౌలభ్యం కోసం శ్రీకాకుళం జిల్లాలో మరో ఐటీడీఏ ఏర్పాటు చేయాలని మా ప్రభుత్వ హయాంలోనే ప్రతిపాదించామన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలోనే గిరిజన అభివృద్ధి జరిగిందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎస్.లక్ష్మి, సర్పంచ్ వెంకునాయుడు, ఎంపీటీసీ సభ్యుడు హరి, వైఎస్సార్‌సీపీ నాయకులు హెచ్.మోహనరావు, ఎస్.సాయికుమార్, మహేష్, సింహాచలం, ఎన్.కృష్ణ, ఎస్.వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురంలో ఈ నెల 25 నుంచి కైలాసనాథ స్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలతో పాటు మే నెల 12 నుంచి 21 వరకు నిర్వహించనున్న గ్రామదేవత ఉత్సవాల దృష్ట్యా గ్రామంలో విద్యుత్ సరఫరాకు ఎటువంటి అవాంతరాలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్టు సర్పంచ్ బి.గౌరీశంకరరావు, విద్యుత్ శాఖ ఏఈ రవికుమార్ తెలిపారు. గ్రామంలో దెబ్బతిన్న స్తంభాల స్థానంలో కొత్తవి వేయడం, అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు.

త్వరితగతిన సర్వేలు


మాట్లాడుతున్న ఎంపీడీఓ గీతాంజలి

సీతంపేట: వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వే, చిల్డ్రన్ సర్వేలు సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీఓ కె.గీతాంజలి తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అసంఘటిత రంగ కార్మికులను ఈశ్రమ్ వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. ఉపాధిహామీ వేతనదారులు, ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులు, రోజువారీ కార్మికులు తప్పనిసరిగా ఈ శ్రమ్‌లో నమోదు చేయించుకోవడం వల్ల రూ.2 లక్షల వరకు ప్రమాద బీమా లబ్ధి చేకూరుతుందని చెప్పారు. అంతకముందు పూతికవలస గ్రామ సచివాలయాన్ని సందర్శించి, సిబ్బంది హాజరు పరిశీలించారు. అలాగే గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులు పర్యవేక్షించారు.అలాగే కీసరజోడు, చిన్నబగ్గ, మర్రిపాడు పంచాయతీల్లో జరుగుతున్న రోడ్డు పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ సత్యం, తదితరులు పాల్గొన్నారు.

నేడు మద్యంషాపుల మంజూరుకు డ్రా

పాలకొండ: గీత, సొండి కులాలకు సంబంధించి కేటాయించిన మద్యం షాపులకు గురువారం డ్రా నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ సూర్యకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జీఎస్ఆర్ఎస్ సమావేశ మందిరంలో డ్రా తీయడం జరుగుతుందని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు విషయాన్ని గుర్తించి ఉదయం 9 గంటలకు హాజరుకావాలని కోరారు.

రోడ్డుపై కూలిన చెట్టు



భామిని: గజపతినగరం వద్ద ఏబీ రోడ్డుపై బుధవారం ఉదయం భారీ వృక్షం నేలకొరిగింది. దీంతో రాకపోకలకు వాహన చోదకులు ఇబ్బంది పడ్డారు. స్థానికులు స్పందించి చెట్టు కొమ్మలు తొలగించడంతో రాకపోకలకు వీలు కలిగింది. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి చెట్టును తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

పరిశీలన

సీతంపేట: మండలంలోని చిన్నబగ్గ, పూతికవలస గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో టెన్త్ విద్యార్థులకు నిర్వహిస్తున్న గ్రాండ్ టెస్టులను ఐటీడీఏ డిప్యూటీ ఈఓ ఆర్.ప్రసన్నకుమార్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెనుకబడిన వారికి ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన


ప్రమాదాల నివారణపై అవగాహన కలిగిస్తున్న సిబ్బంది

పాలకొండ: పట్టణంలోని పలు చోట్ల స్థానిక అగ్నిమాపక శాఖ సిబ్బంది బుధవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక శాఖాధికారి జామి సర్వేశ్వరరావు మాట్లాడుతూ.. అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం మాక్‌డ్రిల్ ద్వారా మంటలను అదుపుచేయడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలు షాపుల యజమానులు, సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

గాదె అనుచరుల సంబరాలు


గాదె శ్రీనివాసుల నాయుడు గెలుపుపై సంబరాలు జరుపుకుంటున్న పీఆర్‌టీయూ నాయకులు

గుమ్మలక్ష్మీపురం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గాదె శ్రీనివాసులనాయుడు విజయం సాధించడంతో ఉపాధ్యాయ సంఘాల నాయకులు బుధవారం గుమ్మలక్ష్మీపురంలో సంబరాలు నిర్వహించారు. ఈ మేరకు పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు హరగోపాల్, సూర్యనారాయణ, మిత్రపక్షాల నాయకులు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి గాదె శ్రీనివాసులనాయుడు కృషి చేస్తారని నమ్మకం ఉందన్నారు. విజయానికి సహకరించిన అందిరికీ కృతజ్ఞతలు తెలిపారు.

యోగాతో ఒత్తిడి దూరం

● ప్రిన్సిపాల్ శ్యామ్‌బాబు


యోగాసనాలపై అవగాహన కల్పిస్తున్న డిగ్రీ కళాశాల ప్రిన్స్‌పాల్, పీడీ, తదితరులు

పాలకొండ రూరల్: క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల ఒత్తిడిని సమర్థవంతంగా అధిగమించవచ్చని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్స్‌పాల్ ఎం.శ్యామ్‌బాబు అన్నారు. ఉమెన్ ఎంపవర్‌మెంట్ విభాగం నేతృత్వంలో బుధవారం స్థానిక డిగ్రీ కళాశాల ఆవరణలో విద్యార్థులకు యోగాపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎం.నిరీక్షణ యోగాసాలు, శారీరక, మానసిక ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తేలికపాటి వ్యాయామాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా విద్యార్థినులు నేటి సమాజంలో ధైర్యంగా ముందుకు వెళ్లాలని, అన్నిరంగాల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్స్‌పాల్ బి.జయమణి, ఐక్యూ కోఆర్డినేటర్ బి.రాజు, అధ్యాపకులు పి.రాజ్యలక్ష్మి, ప్రశాంతి, తదితరులున్నారు.

కూటమి శ్రేణులకే మీరు ముఖ్యమంత్రా..?

● వైఎస్సార్‌సీపీ నాయకుల సూటి ప్రశ్న


మాట్లాడుతున్న లిల్లీపుష్పనాథం, పాపినాయుడు, తదితరులు

పాలకొండ రూరల్: సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉందని గొప్పలు చెప్పుకోవడం కాదు.. ఆ అనుభవం రాష్ట్ర ప్రజల ప్రయోజనాలకు ఉపయోగించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు ఎద్దు లిల్లీ పుష్పనాథం, దుప్పాడ పాపినాయుడు అన్నారు. ఇటీవల పలు సమావేశాల్లో సీఎం చంద్రబాబు వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పనులు చేయొద్దంటూ చేస్తున్న వ్యాఖ్యలను వీరు తప్పుబట్టారు. బుధవారం పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ.. రాజకీయలు కేవలం ఎన్నికల వరకే అని, ఆపై అన్ని వర్గాలను ఒకే దృష్టిలో చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి ఉందన్నారు. మీ వ్యవహారశైలి చూస్తే కేవలం కూటమి శ్రేణులకే ముఖ్యమంత్రిలా చంద్రబాబు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన రోజునే రాజకీయాలకతీతంగా, అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందజేసిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రంలో దాదాపుగా కోటీ 40 లక్షల మంది వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారని, వీరందరి పట్ల ఎలా వ్యవహరించనున్నారో మీ వ్యాఖ్యలే తేటతెల్లం చేస్తున్నాయని చెప్పారు. స్వార్థ రాజకీయాలు విడనాడి రాష్ట్ర శ్రేయస్సు, సంక్షేమం కోసం అధికారం వినియోగించకుంటే ప్రజలే గట్టిగా బుద్ధి చెబుతారన్నారు. పార్టీ నాయకులు యందవ మరియదాసు, తదితరులున్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతం

గరుగుబిల్లి: మండలంలోని పెదగుడబ పంచాయతీ సన్యాసిరాజుపేటలో గర్భిణులకు అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక సీమంతాలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొమరాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి జి.సుగుణకుమారి మాట్లాడుతూ గర్భిణులకు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఆర్.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ఊటలు ధ్వంసం

వీరఘట్టం: మండలంలోని చిన్నగోర గిరిజన గ్రామ సమీపంలో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1500 లీటర్ల బెల్లం ఊటలను బుధవారం ధ్వంసం చేసి ప్లాస్టిక్ డ్రమ్ములను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై జి.కళాధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సారా తయారుచేసినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించండి..

భామిని: ప్రజల ఆరోగ్యం కాపాడే చిరుధాన్యాల సాగుకు ముందుకు రావాలని మండల వ్యవసాయాధికారి కె. సింహాచలం అన్నారు. మండలంలోని లోహరిజోలలో వ్యవసాయ సహాయకుడు ఈశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ..అత్యధిక గిరిజన రైతులున్నందున ఐటీడీఏ నుంచి ఉచితంగా రాగులు, ఇతర చిరుధాన్యాల విత్తనాలు ఇప్పిస్తామన్నారు. సంప్రదాయ పంటలు కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు వెంకటరమణ, సిర్ల జయరామ్, రైతులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి..



మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సీడీపీఓ బి.సిమ్మాలమ్మ ఆకాంక్షించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా మండలంలోని చిన మంగళాపురం, ఎం.సింగుపురం గ్రామాల్లో బుధవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. అంగన్‌వాడీలు క్షేత్ర స్థాయిలో మహిళా శక్తిపై ఈ నెల 8వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు దశారత్నం, టి.మేరీ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు. – పాలకొండ రూరల్